క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దౌల్తాబాద్: మండలంలోని దౌల్తాబాద్, సురాయిపల్లి, బాలంపేట విద్యుత్ ఉపకేంద్రాల్లో మరమత్తుల కారణంగా విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మహిపాల్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దౌల్తాబాద్, సురాయిపల్లి ఉపకేంద్రాల్లో ఉదయం 11గంటల నుంచి 1గంటల వరకు, బాలంపేట ఉపకేంద్రంలో 2గంటల నుంచి 4గంటల వరకు అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాల ప్రజలు సహకరించాలని కోరారు.

పరిగిలో..

పరిగి: నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పాటుతుందని విద్యుత్ ఏఈ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాపోల్ సబ్‌స్టేషన్ పరిధిలోని రాపోల్ సయ్యాద్‌పల్లి, సయ్యాద్ మల్కాపూర్, రాఘవపూర్, పోల్కంపల్లి, ఖుదావన్‌పూర్, తొండపల్లి, యాబాజిగూడ, నర్సయ్యగూడ, తొండుపల్లి గ్రామాలకు ఉ.11 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు చెప్పారు. సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని తెలిపారు. కావునా, వినియోగదారులు సహకరించాలని కోరారు.

ఉద్యోగ విరమణ సహజం



విజయ్‌కుమార్‌కు సన్మానం చేస్తున్న నాయకులు

దౌల్తాబాద్: ప్రతి ఒక్కరికి ఉద్యోగ విరమణ సహజం. అయితే ఎక్కడ ఉద్యోగం చేసినా గుర్తింపు తెచ్చుకునేలా పనిచేయాలని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో గోకఫసల్‌వాద్ ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం విజయ్‌కుమార్ పదవీ విరమణ సన్మాన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. విజయ్ కుమార్ ఉపాధ్యాయ వత్తిలో విధి నిర్వహణలో మంచి గుర్తింపు తెచ్చుకునేలా పని చేశారని కొనియాడారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మహిపాల్, ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్‌ఎంపీపీ మహిపాల్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పీఆర్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అమర్‌నాథ్, వెంకట్‌రాంరెడ్డి తదితరులున్నారు.

అలరించిన విద్యార్థుల నృత్యాలు



నృత్యాలు చేస్తున్న విద్యార్థులు

కొడంగల్ : మండల పరిధిలోని పర్సాపూర్ ప్రాథమిక ఉన్నత పాఠశాలలో విద్యార్థుల నృత్యాలు ఆహ్వానితులను అలరించాయి. శనివారం నిర్వహించిన పదవీ విరమణ కార్యక్రమంలో విద్యార్థులు ఆటపాటలతో మురిపించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్, ప్రధాన కార్యదర్శి షఫీ, ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయురాలు హరిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాల గది ప్రారంభం



గదిని ప్రారంభిస్తున్న వసంతరెడ్డి

మోమిన్‌పేట్: మోమిన్‌పేట్ మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు వద్ద శనివారం తల్లిపాలు తాగించు గదిని ప్రారంభించారు. రంగారెడ్డి జిల్లా శంకర్‌పల్లి మండలం, మహారాజ్‌పేట గ్రామానికి చెందిన దాతలు రేసు వసంతరెడ్డి, ఆమె కుమారులు మహేందర్‌రెడ్డి, రాజేందర్‌రెడ్డిలు గదిని విరాళంగా ఇచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి గమ్యస్థానాలకు వెళ్లివచ్చే తల్లులు తమ పిల్లలకు బహిరంగంగా పాలివ్వకుండా గదిలోకి వెళ్లి పాలు ఇచ్చుకునే అవకాశం కల్పించారు.

భక్తిశ్రద్ధలతో సామూహిక గీతాపారాయణం



హోమం చేస్తున్న దంపతులు

బషీరాబాద్: మండలంలోని దామర్‌చెడ్ అంబాభవాని మాత ఆలయంలో శనివారం సామూహిక గీతాపారాయణం నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి శంకర్ స్వామిజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి వివిధ ప్రాంతాల నుంచి 41మంది దంపతులు పాల్గొన్నారు. భగద్గీత ఆధ్యాయాల్లోని శ్లోకాలు పఠించారు. అలాగే, మృత్యుంజయ హోమం నిర్వహించారు. షాద్‌నగర్ నుంచి ప్రత్యేక వక్తగా వచ్చిన దయానందగిరి స్వామి భక్తులు భక్తిమార్గనిర్దేశం చేశారు. మానవుడు భగవద్గీతను అనుసరిస్తే జీవితం సుఖమయం అవుతుందన్నారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు.

అన్నదాత చూపు వరి వైపు

- జిల్లాలో పెరిగిన సాగు
- అడుగంటిన భూగర్భజలాలు



పాత కొడంగల్‌లో బోరు కింద సాగు చేసిన వరి పైరు

కొడంగల్ : నియోజకవర్గంలో రైతులు వరిసాగు వైపు మొగ్గు చూపుతున్నారు. వ్యవసాయాధికారుల అంచనా ప్రకారం గతం కంటే ఈ ఏడాది వరి సాగు పెరిగినట్లు తెలుస్తోంది. చెరువులు, కుంటలు, చిన్న పాటి సాగునీటి ప్రాజెక్టులు, బోరుబావుల కింద అధిక మొత్తంలో వరిసాగు చేస్తున్నారు. ఈ ప్రాంతంలో వర్షాధార పంటలపై ఆధారపడి రైతులు వ్యవసాయం చేస్తున్నారు. ధర్మం పంటగా పేరుగాంచిన జొన్న, అధిక దిగుబడి వచ్చే కంది, శనగ, పెసర, మినుము తదితర పంటలపై ఆసక్తి తగ్గింది. అడవి పందులు, పిట్టల బెడదే కారణమని రైతులు వాపోతున్నారు.

వికారాబాద్ జిల్లాలో...

కొడంగల్ నియోజకవర్గంలోని కొడంగల్, బొంరాస్‌పేట, దౌల్తాబాద్‌తో పాటు జిల్లాలోని ఇతర మండలాల్లో సాగునీటి వనరులపై ఆధారపడి రైతులు పంటలు వేస్తున్నారు. వికారాబాద్ జిల్లాలో మొత్తం 2,61,360 హెక్టార్ల భూమి ఉంది. అందులో ఎక్కువ మొత్తంలో వరిసాగు చేస్తున్నారు. కాకరవాణి ప్రాజెక్టు, హస్నాబాద్ చెరువు, కొడంగల్ పెద్ద చెరువు, బొంరాస్‌పేట, దౌల్తాబాద్ చెరువులతో పాటు కోట్‌పల్లి, జుంటిపల్లి, లక్నాపూర్, సర్పన్‌పల్లి, చిన్నవాగు ప్రాజెక్టుల కింద రైతులు వరి సాగు చేశారు. ఆరుతడి పంటల కంటే వరిపైనే రైతులు ఆసక్తి చూపుతున్నారు. భారీ సాగునీటి వనరులు లేని కొడంగల్ నియోజకవర్గంలో వరిసాగు విస్తీర్ణం పెరిగింది. ప్రస్తుతం చెరువులు, కుంటలు, చిన్న పాటి సాగునీటి ప్రాజెక్టులతో పాటు బోర్ల కింద వరి సాగు చేస్తున్నారు.

ధర్మం పంట కనుమరుగు

ధర్మం పంటగా పేరుగాంచిన జొన్న కనుమరుగవుతోంది. అడవి పందులు, పిట్టల బెడదతో వాణిజ్య పంటలను సాగు చేయడానికి రైతులు ఆసక్తి చూపడం లేదు. ఒకప్పుడు వలసలు, కరువు కాటకాలతో దుర్భిక్షం నెలకొన్న పాలమూరు జిల్లాలో నేడు పంటలకు కొదవ లేదు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతో పాటు వికారాబాద్ జిల్లాలో సాగునీటి లభ్యత పెరగడంతో వానాకాలం, యాసంగి అనే తేడా లేకుండా పంటల సాగు గణనీయంగా పెరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు ఇటీవల నిర్వహించిన సాగు సర్వేలో సంప్రదాయ పంటలు ఆరుతడి సాగుపై రైతులు అనాసక్తి చూపుతున్నట్లు తేలింది. ఆయా ప్రాంతాల్లో భూమి స్వభావం దిగుబడి వాతావరణ పరిస్థితులను అంచనా వేసుకొని రైతులు పంటలను సాగు చేసేవారు. అయితే వరికంటే ఇతర పంటల సాగుచేస్తే ఖర్చుతో పాటు కష్టం ఎక్కువగా ఉందని రైతులు భావిస్తున్నారు. దీంతో సాగునీటి వనరులు ఉన్న ప్రాంతాల్లో వరిధాన్యం పండిస్తున్నారు. జిల్లాలో యాసంగి పంటల సాగు విస్తీర్ణం వివరాలను వ్యవసాయాధికారులు సేకరిస్తున్నారు. ప్రతి గుంటను లెక్కించి పంటల వివరాలను ధ్రువీకరిస్తున్నారు. వరి విస్తీర్ణం జిల్లాలో పెరుగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. అయితే, భూగర్భ జలాలు అడుగంటడంతో వరిపైరు ఎండిపోతుంది. రైతులకు నష్టం జరుగుతోంది. బోరు బావుల్లో నీటి సామర్థ్యం రోజు రోజుకు తగ్గుతోంది. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

రైతులకు రుణాలు ఇస్తాం

ఎల్మకన్నె సొసైటీ చైర్మన్ రవిగౌడ్



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రవిగౌడ్, తదితరులు

తాండూరు రూరల్: వచ్చే ఖరీఫ్‌లో అర్హులైన రైతులకు రుణాలు ఇస్తామని ఎల్మకన్నె సొసైటీ చైర్మన్ రవిగౌడ్ అన్నారు. శనివారం ఎల్మకన్నె సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా రవిగౌడ్ మాట్లాడుతూ.. సొసైటీలో రూ.16 కోట్ల 70 లక్షలు బంగారంపై రుణాలు ఇచ్చామన్నారు. రూ.5 కోట్ల 32 లక్షలు రైతులకు స్వల్పకాలిక రుణాలు, రూ. 2 కోట్ల 50 లక్షలు దీర్ఘకాలిక రుణాలు అందజేశామని చెప్పారు. ప్రస్తుతం సొసైటీ లాభాల్లో నడుస్తోందన్నారు. ఈ ఏడాది బంగారం రుణాలపై కోటికి పైగా లాభం వచ్చినట్లు చెప్పారు. లాభం రూపంలో వచ్చిన నగదు రైతులకు రుణాలు అందజేస్తామన్నారు. సొసైటీ కింద 556 మంది రైతులకు రూ. 2 కోట్ల 36 లక్షలు రుణమాఫీ కావాల్సి ఉండగా 320 మంది రైతులకు కోటిన్నర మాత్రమే రుణమాఫీ అయిందని తెలిపారు. ఇంకా 236 మంది రైతులకు రూ.97 లక్షలు రుణమాఫీ కావాల్సి ఉందని చెప్పారు. అలాగే, సొసైటీ కింద 26 మంది రైతుల నుంచి రూ.16 లక్షల మొండి బకాయిలు రావాల్సి ఉందని వివరించారు. మొండిబకాయిలు చెల్లిస్తే కొత్తరుణాలు ఇస్తామని తెలియజేశారు. కార్యక్రమంలో సొసైటీ వైస్ చైర్మన్ ప్రశాంత్‌రెడ్డి, సీఈఓ శ్రీనివాస్, డైరక్టర్లు అమృతయ్యగౌడ్, రాఘవేందర్, వెంకట్రాంరెడ్డి, హన్మంత్‌రెడ్డి, సురేందర్‌రెడ్డి, పార్వతమ్మ, అనంతమ్మ, పెంద్యా నర్సిములు, సిద్ధయ్యస్వామి, ఫన్నీబాయిలు ఉన్నారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే వేడుకలు



కేరింతలు కొడుతున్న చిన్నారులు

తాండూరు టౌన్ : తాండూరు పట్టణం షావుకారుపేట్‌లోని ఆపిల్ కిడ్స్ ప్లే స్కూల్‌లో శనివారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. యూకేజీ పూర్తి చేసుకున్న విద్యార్థులకు ప్రోత్సాహకంగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా చిన్నారులు ఆటా పాటలు, సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు. అనంతరం పాఠశాల కరస్పాండెంట్ పి వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వనజ మాట్లాడుతూ.. విద్యార్థులకు క్రీడా పద్ధతిలో బోధన కొనసాగిస్తూ వారికి విద్యపై మక్కువ పెంపొందిస్తున్నామన్నారు. గుణాత్మక విద్యతో పాటు, సంస్కతి సంప్రదాయాలను నేర్పిస్తున్నామని చెప్పారు. విద్యను వ్యాపార ధోరణితో కాకుండా సామాజిక సేవా తత్పరతతో పాఠశాలను కొనసాగిస్తున్నట్లు వివరించారు.

ఎండాకాలం.. చల్లదనం



పళ్లరసాల బండి వద్ద ప్రజలు

బొంరాస్‌పేట: వేసవి ఎండలు ముదురుతున్న తరుణంలో జనం చెట్లనీడ, చల్లటి నీటితో దాహం తీరేలా చూసుకుంటారు. బొంరాస్‌పేట మండల పరిధిలోని జాతీయరహదారి, దుద్యాల మండల పరిధిలోని కోస్గి, కొడంగల్, మహబూబ్‌నగర్ రహదారులు వేసవితాపం తీర్చే పళ్ల, ఐస్‌క్రీములు, పళ్లరసాలు విక్రయిస్తున్నారు. వేసవితాపం తీర్చే వ్యాపారాలు పెరిగాయి. కాలినడక వెళ్లే తండాల, గ్రామాల విద్యార్థులు తాపానికి ఓర్చుకోలేక పోతున్నారు.

ముగిసిన పది పరీక్షలు



ధారూరు: సంతోషంతో ఎగిరి గంతులేస్తున్న విద్యార్థులు

కుల్కచర్ల: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలో 1075మంది పదవ తరగతి విద్యార్థులు ఉండగా, 1074మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్షలు రాశారని ఎంఈఓ హబీబ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం పదవ తరగతి పరీక్షలు ముగియడంతో విద్యార్థులు సంతోషంగా తమ ఇళ్లకు ప్రయాణమయ్యారు. మరికొందరు విద్యార్థులు ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు.

తాండూరు రూరల్‌లో..

తాండూరు రూరల్: మండలంలోని పదో తరగతి పరీక్షలు శనివారం ప్రశాంతంగా ముగిశాయి. తాండూరు పట్టణం,రూరల్ కలిపి 14 సెంటర్లలో విద్యార్థులు పరీక్షలు రాశారు.మొత్తం 2286 మంది విద్యార్థులకు గాను, 2276 మంది పరీక్షలు రాసినట్లు ఎంఈఓ వెంకటయ్య తెలిపారు. 10 మంది విద్యార్థులు మాత్రమే పరీక్షకు గైర్హాజరు అయినట్లు చెప్పారు.

ధారూరులో..

ధారూరు: పదవ తరగతి పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. మండలంలోని కేరెల్లి, ధారూరు ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాల్లో మొదటి రోజు ఇద్దరు విద్యార్థులు గైర్హాజరు అయ్యారు. రెండో రోజు నుంచి ఒక విద్యార్థి గైర్హాజరు అవుతూ వచ్చారు. 312 మంది విద్యార్థులు పరీక్షలు రాశారు. శనివారం చివరి పరీక్ష రాసిన విద్యార్థులు పరీక్షలు బాగా రాశామని, 10 జీపీఏ రావచ్చని ధీమా వ్యక్తం చేశారు. పరీక్ష రాసి బయటకు వచ్చిన విద్యార్థులు మిత్రులతో కలిసి గెంతలేయడం, సంతోషగా తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

ఆడబిడ్డలకు అండగా ఉంటాం



పెళ్లి కానుక అందజేస్తున్న మాజీ సర్పంచ్

కుల్కచర్ల: పేదింటి ఆడబిడ్డలకు అండగా ఉంటామని పటేల్ చెరువు తండా మాజీ సర్పంచ్ శాంతిబాయితులసిరాం అన్నారు. శనివారం కుల్కచర్ల మండలం పటేల్ చెరువు తండా గ్రామపంచాయతీ అనుబంధ గ్రామం పోటిగడ్డ తండాకు చెందిన నిఖిత వివాహానికి ఒక క్వింటా సోనబియ్యం, 15కిలోల మంచినూనె, 5కిలోల కందిపప్పు, పెళ్లికి అవసరమైన వంట సామగ్రి అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... సర్పంచ్‌గా ఉన్నా లేకున్నా గ్రామ ఆడపడచులకు సాయం చేసేందుకు ముందుంటామని పేర్కొన్నారు. గ్రామంలో జరిగే ఆడబిడ్డల పెళ్లిళ్లకు తమ పెళ్లి కానుక నిర్విరామంగా అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సరదాగా కాసేపు



అక్కమ్మ చెరువులో ఈతకొడుతున్న మాజీ ఎంపీ విశ్వేశ్వర్‌రెడ్డి

కుల్కచర్ల: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో బీజేపీ విజయ సంకల్పయాత్రను నిర్వహిస్తున్న చేవెళ్ల బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి శనివారం కుల్కచర్ల మండలంలో పర్యటించారు. ప్రచార పర్వంలో భాగంగా కుల్కచర్ల మండలం ముజాహిద్‌పూర్‌లోని అక్కమ్మ చెరువులో స్థానిక నేతలతో కలిసి ఉల్లాసంగా ఉత్సాహంగా ఈతకొట్టి సేదతీరారు.

గురునాథ్‌రెడ్డికి ఆత్మీయ సత్కారం



సన్మానం చేస్తున్న వీరశైవ సంఘం సభ్యులు

కొడంగల్ : రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్‌గా నియమితులైన కొడంగల్ మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డిని వీరశైవ విద్యావర్ధక సంఘం సభ్యులు శనివారం సత్కరించారు. పూలదండ, శాలువాతో సన్మానం చేశారు. గురునాథ్‌రెడ్డి చేసిన సేవలను కొనియాడారు. వీరశైవ సంఘం సీనియర్ సభ్యులు విజయ్‌కుమార్, సుధాకర్, కరుణాకర్, నాగరాజు, నాగేందర్ తదితరులు శనివారం గురునాథ్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో సీనియర్ నాయకుడిగా ఉన్న గురునాథ్‌రెడ్డి కొడంగల్ నియోజకవర్గం నుంచి ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలిచి రికార్డు సృష్టించారని కొనియాడారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు వేయాలి

తహసీల్దార్ విజయకుమార్



ప్రమాణం చేస్తున్న అధికారులు, ప్రజలు

కొడంగల్ : మహబూబ్‌నగర్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని తహసీల్దార్ విజయ్‌కుమార్ అన్నారు. ఓటర్లను చైతన్యం చేయడానికి 5కె రన్ కార్యక్రమం చేపట్టామన్నారు. పట్టణంలోని సంత బజార్‌లో శనివారం ఉదయం తహసీల్దార్ 5కె రన్‌ను జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం అంబేద్కర్ చౌరస్తాలో ఎన్నికల నియమావళిని చదివి వినిపించారు. ఎన్నికల్లో ప్రలోభాలకు గురికాకుండా ఓటు హక్కు వేయాలని ఓటర్లతో ప్రమాణం చేయించారు. ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలన్నారు. భారతదేశం దశదిశను మార్చే ఎంపీ ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు వేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్‌కుమార్, డీటీ సురేశ్, ఎంఈఓ రాంరెడ్డి, సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ పాల్గొన్నారు.

మార్కెట్‌కు 210 బస్తాల కందులు

ధారూరు: ధారూరు వ్యవసాయ మార్కెట్‌కు శనివారం 210 బస్తాల కందులు వచ్చాయి. గత రెండు నెలల నుంచి ధర పెరుగుతుందనే ఆశతో ఎదురుచూస్తున్నామన్నారు. దీంతో ప్రతివారం మార్కెట్లో అదే ధర ఉండటంతో గత్యంతరం లేక విక్రయించాల్సి వచ్చిందని రైతులు వాపోయారు. క్వింటాల్‌కు రూ.10, 210 నుంచి రూ.10,250 వరకు వ్యాపారులు కొనుగోలు చేసినట్లు మార్కెట్ కార్యదర్శి సిద్ధమ్మ తెలిపారు. అలాగే, మొక్కజొన్న 200 బస్తాలు వచ్చాయని, క్వింటాల్‌కు రూ. 2,130 నుంచి 2,230 వరకు అమ్మకాలు జరిగాయని ఆమె వివరించారు.

ఉచిత డీఎస్సీ కోచింగ్ ఏర్పాటు చేయాలి

సీపీఐ జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రయ్య



బొంరాస్‌పేట: ప్రభుత్వ ప్రకటించిన డీఎస్సీ పరీక్షకు పేద నిరుద్యోగులకు ఉచిత కోచింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సీపీఐ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు బుస్స చంద్రయ్య కోరారు. శనివారం ఆయన దుద్యాల మండల కేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి ఉపాధ్యాయ ఉద్యోగాలను భర్తీ చేయడం హర్షనీయమన్నారు. కాగా, పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి ఉద్యోగం సాధించేందుకు టెట్ ఉత్తీర్ణులై ఉన్నారని అన్నారు. సీఎం నియోజకవర్గ కేంద్రం కొడంగల్‌లో పేద కుటుంబాల నిరుద్యోగులున్నారని వీరంతా డీఎస్సీ పరీక్షలకు సమాయత్తమవుతున్నారు. టెట్ అర్హత సాధించి, ఉద్యోగం సాధించేందుకు డీఎస్సీ ఉచిత కోచింగ్ సెంటర్లు ఏర్పాటు చేయాలని కోరారు.

వీధినాటకానికి విశేష స్పందన



కొనసాగుతున్న వీధినాటకం

కుల్కచర్ల: మండల కేంద్రంలో స్థానిక భజన మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి వీధినాటకం వైభవంగా కొనసాగుతోంది. శుక్రవారం రాత్రి 10గంటల నుంచి తెల్లవారుజామున 4గంటల వరకు కొనసాగింది. వీధినాటకాన్ని వీక్షించేందుకు గ్రామస్తులు పెద్దఎత్తున తరలివచ్చారు.

సొంత గ్రామస్తులతో స్పీకర్ భేటీ



స్పీకర్ ప్రసాద్‌కుమార్‌తో బెల్కటూర్ వాసులు

తాండూరు రూరల్: అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ తన సొంత గ్రామం బెల్కటూర్ వాసులతో భేటీ అయ్యారు. శనివారం వికారాబాద్‌లో ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయాన్ని ఆయన ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రసాద్‌కుమార్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. స్పీకర్ సొంత ఊరు బెల్కటూర్ వాసులు ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సొంత ఊరివాళ్లతో మాట్లాడుతూ.. ఎంత ఎదిగిన ఊరును మాత్రం మరచిపోనని అన్నారు. ఎన్నికల తర్వాత బెల్కటూర్‌లో పర్యటిస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్తులతో చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో నర్సింలు, వెంకటేష్, చంద్రప్ప, జగ్గప్ప, రాము, వెంకటప్ప, ఫకిరప్ప, శ్రీనివాస్, నర్సప్పలు ఉన్నారు.

ఉచిత వైద్య పరీక్షలు



రోగులకు పరీక్షలు చేస్తున్న వైద్య సిబ్బంది

కొడంగల్ రూరల్ : పట్టణంలోని మహాదేవుని ఆలయం వద్ద పలు గ్రామాలకు చెందిన ప్రజలకు శనివారం ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. మధుకర సేవా సమితి ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. ఉ.11 గంటల నుంచి 3 గంటల వరకు జరిగిన వైద్య శిబిరంలో ఆరోగ్య సమస్యలు ఉన్నవారు పరీక్షలు చేయించుకున్నారు. గత ఐదేళ్లుగా ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

ధ్యానం అలవాటుగా మార్చుకోవాలి



ధ్యానంపై అవగాహన కల్పిస్తున్న బాలకృష్ణారెడ్డి

కుల్కచర్ల: విద్యార్థులు చిన్నప్పటి నుంచే ధ్యానం చేయడం అలవాటుగా మార్చుకోవాలని స్పిరిచివల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్ల అంజనేయరెడ్డి, ధ్యాన ప్రచారకర్త బాలకృష్ణారెడ్డి అన్నారు. శనివారం కుల్కచర్ల మండలంలోని ముజాహిద్‌పూర్, రాంరెడ్డిపల్లి గ్రామాల్లో ధ్యానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చిన్నారులు, విద్యార్థులు తమ చిన్నతనం నుంచే ధ్యానం చేయడం పట్ల అవగాహన కల్గిండాలని చెప్పారు. ధ్యానం చేయడం వల్ల అనారోగ్య సమస్యలను అధిగమించవచ్చని పేర్కొన్నారు. ఒత్తిడిని దూరం చేసుకుని మానసిక ప్రశాంతతను పొందవచ్చని సూచించారు. కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు పాల్గొన్నారు.

ధ్యానంపై అవగాహన

దోమ: ప్రతి ఒక్కరు ధ్యానంపై అవగాహన పెంపొందించుకోవాలని పిరమిడ్ స్పిరిచివల్ సొసైటీ ధ్యాన ప్రచార కార్యదర్శి బంగ్ల అంజనేయరెడ్డి అన్నారు. శనివారం మోత్కూరు పాఠశాలలో ధ్యానంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ధ్యానం చేయడం వల్ల మనస్సును కేంద్రీకృతం చేసుకుని అనుకున్న లక్ష్యాలను ఛేదించవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులు ప్రతి రోజు ధ్యానం చేయాలని తద్వారా చదువుకున్న అంశాలన్నింటినీ గుర్తించుకోవచ్చని చెప్పారు. మానసిక ప్రశాంతత లభిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘ సభ్యులు బాలకృష్ణారెడ్డి, గుండం శైలజ, శోభిత, తిరుపతయ్య పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న సభ్యులు